క్లుప్తంగా

సీబీఎస్‌ఈ ఫలితాల్లో ప్రతిభ


సాయి యుగవర్ధ్

చివ్వెంల: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) ఫలితాల్లో మండల పరిధి లోని దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ఎంఎస్ఆర్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 36 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 36 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు అయినట్లు కళాశాల కరస్పాండెంట్ కొల్లు శ్రీనివాస్ తెలిపారు. వీరిలో పాఠశాలకు చెందిన ఎ.సాయి యుగవర్ధ్ 500 మార్కులకుగాను 483 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం


హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న గ్రామస్తులు

తిరుమలగిరి : గుండెపురి గ్రామంలోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌కు నిర్వాహకులు హైదరాబాద్ వెళ్లి ఆహ్వానపత్రిక అందజేశారు. ఉత్సవాల నిర్వహణకు మాజీ ఎమ్మెల్యే రూ.25 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామరాజు శరత్‌బాబు, మద్దెల సందీప్, పానుగంటి నర్సింహారెడ్డి, బెడిద శ్రీను, కొమ్ము భిక్షం, పాలకుర్తి ఉపేందర్, జాని, ఎల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు రహిత సమాజ స్థాపనకు కృషి


అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్

సూర్యాపేట అర్బన్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు రహిత సమాజ స్థాపనకు తనవంతు కృషి చేస్తానని ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, ఎన్టీఆర్ పార్క్ సమీపంలో ప్రచారం నిర్వహించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు, మద్యపానం, దూమపానం వల్ల కలిగే నష్టాలపై పాలీసెట్ పరీక్ష కోసం వచ్చిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన


మాచనపల్లిలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

నూతనకల్ : కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం ఎగుమతులను వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు మాచనపల్లి, పెదనెమిల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. తేమశాతం వచ్చిన ధాన్యానికి వెంటనే కాంటాలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

బడిబాట ప్రచారం

అర్వపల్లి : అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ పీడీ, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి. మల్లేష్ అధ్వర్యంలో మంగళవారం అడివెంల, కుంచమర్తి గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో టెన్త్ ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారని చెప్పారు. అలాగే క్రీడలలో రాష్ట్రస్థాయిలో పతిభ చూపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. నాగయ్య, కె. వీరన్న, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

తిరుమలగిరి : కాంగ్రెస్ పార్టీ బ్లాక్, మండల, గ్రామ, వార్డు స్థాయి అధ్యక్ష పదవుల కోసం మంగళవారం తిరుమలగిరిలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు టీపీసీసీ ఎన్నికల పరిశీలకుడు మురళీనాయక్, తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్, జిల్లా పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌లకు దరఖాస్తులు అందజేశారు. దరఖాస్తులు అందజేసిన వారిలో కుంభం సతీష్ గౌడ్, ఎర్ర యాదగిరి ఉన్నారు.


కాంగ్రెస్ మండల అధ్యక్షుడి పదవి కోసం దరఖాస్తు చేసుకుంటున్న సతీష్ గౌడ్

సర్కారు బడి పిలుస్తోంది


తిరుమలగిరిలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా 'బడిబాట'
- ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు రావడంతో ప్రభుత్వ బడులకు పెరుగుతున్న ఆదరణ

తిరుమలగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు రావడంతో ప్రతి ఏడాది జూన్‌లో షురూ అయ్యే బడిబాట కార్యక్రమాన్ని జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ 23 నుంచే మొదలు పెట్టారు. రాష్ట్ర విద్యాశాఖ ప్రభుత్వ ఉపాధ్యాయులను అలర్ట్ చేయడంతో ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని విస్తృతం చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జూన్ 6 నుంచి మెగా ప్రోగ్రామ్‌ను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్నారు.

గ్రామాల్లో ప్రచారం విస్తృతం..

సర్కారు స్కూళ్లలో చదవడం ద్వారా ఉపయోగాలు, అనుభవజ్ఞులైన టీచర్లు, ఉచిత యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఇలా అన్ని ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ స్కూళ్ల టీచర్లు ప్రచారం చేస్తున్నారు. తమ పాఠశాలలో విద్యార్థులు సాధించిన విజయాలను తల్లిదండ్రులకు చెబుతూ గవర్నమెంట్ బడిలో విద్యార్థులను చేర్పించేలా ప్రోత్సహిస్తున్నారు. గ్రామపంచాయతీ, జన సమీకరణ ఉన్న ప్రాంతాల్లో స్వయం సహాయక బృందాల సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, పిల్లల తల్లిదండ్రులు, అంగన్‌వాడీల సహకారంతో బడిబాట కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని 278 ప్రభుత్వ స్కూళ్లలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతోపాటు ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటూ విద్యార్థులను చేర్పించేలా తల్లిదండ్రులను ప్రోత్సహిస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు రావడంతో తల్లిదండ్రులు కూడా సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించేందుకు ముందుకు వస్తున్నారని బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న వారు చెబుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రభుత్వ స్కూల్స్‌లోనే పదో తరగతి విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. పేద, మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ మోజులో పడి ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. తల్లిదండ్రులు విజ్ఞతతో ఆలోచించి సర్కారు బడుల్లోనే తమ పిల్లలను చేర్పించాలి. టీచర్లు మరింత అంకిత భావంతో పని చేసేలా చర్యలు చేపడుతాం.

– శాంతయ్య, ఎంఈఓ, తిరుమలగిరి

శ్రీనివాసుడికి లక్షమల్లెల పుష్పార్చన


పుష్పార్చన అనంతరం దేవతా మూర్తులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆండాళ్ గోష్ఠి మహిళా భక్తుల ఆధ్వర్యంలో మంగళవారం స్వామివారికి ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు లక్ష మల్లెలతో అర్చనలు నిర్వహించారు. యజ్ఞాచార్యులు నల్లాన్ చక్రవర్తుల హరిచరణ్ ఆచార్యులు సంకల్పం చెప్పి మల్లె పుష్పార్చన విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీహరి ఆచార్యులు, సంకర్షణాచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరెడ్డి, భక్తులు పాల్గొన్నారు. పూజ అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాదం అందజేశారు. సాయంత్రం పట్టణ పురవీధులలో స్వామివారిని భజనలు, కోలాటాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగించారు.

నేడు మహా పూర్ణాహుతి, చక్రస్నానం..

బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో మహా పూర్ణాహుతి నిర్వహించి కోనేరులో చక్రస్నానం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు మంగళవారం తెలిపారు. సాయంత్రం శ్రీ పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలకనున్నట్లు తెలియజేశారు.


పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు


వేడుకల్లో పాల్గొన్న భక్తులు

వర్షాకాలంలోగా పనులు పూర్తిచేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్


చివ్వెంల : స్వామి నారాయణ్ గురుకులంలో..

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేట అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలో అమృత్ పథకం 2.0లో జరుగుచున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ పనులను రానున్న వర్షాకాలంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణంలో నీటి సరఫరా సక్రమంగా అయ్యేవిధంగా చూడాలని అన్నారు. ప్రతి ఇంటిలో ప్రజలు ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకొని భూమిలో నీటి శాతం పెంపొందించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 31లోపు 25శాతం రిబేట్‌తో పేమెంట్ చెల్లించాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ లేకుండా ఉంటే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వకూడదని అన్నారు. పట్టణంలో రానున్న వర్షాకాలంలోగా నాలాల్లో, డ్రెయినేజీలలో పూడిక తొలగింపు పనులు 100శాతం పూర్తిచేయాలని తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. పట్టణంలో పెట్టిన ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని తెలిపారు. నర్సరీలు, పార్కుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఇళ్ల పన్నులు సకాలంలో వసూలు చేసి, భువన్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. రోడ్ల వెంట, మురికి కాలువలలో చెత్త వేసే వారిపై చర్య తీసుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. నాణ్యతతో పనులు జరిగే విధంగా టెక్నికల్ పర్సన్లు, ఇంజనీర్లు ఫీల్డ్ మీద ఉండి పనులు చేయించాలన్నారు. వార్డు అధికారులు విధిగా ప్రతి రోజు ఫీల్డ్‌లో ఉండి జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలని, వార్డు పరిధిలో కొత్తగా ఇంటి నిర్మాణం చేసే వారిని గుర్తించి ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ, మున్సిపల్ ఈఈ కిరణ్, డీఈ సత్యారావు, రమాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఆర్వో కళ్యాణి, టీపీఎస్ శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

చివ్వెంల : విద్యార్థుల విద్యాభివృద్ధే ధ్యేయంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని శ్రీ స్వామి నారాయణ్ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో పనిచేసి ప్రతి పేద విద్యార్థి ఉన్నత స్థానం చేరుకునేలా చూడాలని తెలిపారు. సమాజంలో అసమానతలు తొలగించాలంటే విద్య ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రత్యేక బోధనపై ఉపాధ్యాయులకు మార్గ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, కోఆర్డినేటర్లు జనార్దన్, పూలమ్మ, స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఆర్పీ రాంబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్తకళ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని సంతోష్ బాబు చౌరస్తా వద్ద ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు వినోద్ కుమార్, శ్రవణ్ చౌదరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో చీరలు, డ్రెస్‌లు, డ్రెస్ మెటీరియల్ అతి తక్కువ ధరలకే లభిస్తాయని తెలిపారు. మే 20 వరకు ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

నూతనకల్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరవుతున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారులు సమాచారం ఇచ్చిన లబ్ధిదారులు సకాలంలో హాజరై చెక్కులను పొందాలని ఆయన కోరారు.

సీఎంపై ఇష్టానుసారంగా మాట్లాడటం తగదు

అర్వపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిపై ఎంపీ ఈటల రాజేందర్ ఇష్టానుసారంగా మాట్లాడటం తగదని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ అన్నారు. అర్వపల్లిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాజకీయంగా అనుభవం ఉన్న ఈటల సీఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడిన తీరు తెలంగాణ ప్రజలు తలదించుకునేలా ఉందన్నారు.

కనకదుర్గమ్మ ఆలయ ఉత్సవాలు

నూతనకల్ : మండల పరిధిలోని బిక్కుహేమ్లాతండా ఆవాసం బద్యాతండాలో మంగళవారం కనకదుర్గమ్మ నాలుగో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుగులోతు కృష్ణానాయక్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి నీనావత్ రేద్యా, ధరావత్ కీల్యా, సైదిశంకర్‌నాయక్, చాప్లా, వీరన్న, పంతులు, దేవోజీ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి ఎంతో విలువైనది


ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైద్యసిబ్బంది

సూర్యాపేటటౌన్ : రోగుల పట్ల అంకితభావంతో సేవలందిస్తున్న నర్సుల సేవలు ఎంతో విలువైనవని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జయలత అన్నారు. జిల్లా కేంద్రంలో సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ వరమ్మ, రేణుక భాయి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ సేవల మాతృమూర్తి ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ వైద్య సిబ్బంది, నర్సింగ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు


నాగారంలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి


పస్తాలలో..

- నిర్వహణను పట్టించుకోని అధికారులు
- దప్పికతో అల్లాడుతున్న పశువులు

నాగారం: మూగజీవాల దాహార్తిని తీర్చడానికి గ్రామాల్లో నీటితొట్లను నిర్మించిన అధికారులు.. వాటి నిర్వహణను మాత్రం మరిచారు. లక్షలు వెచ్చించి నిర్మించిన నీటితొట్లు నేడు పూర్తిగా నిరుపయోగంగా మారాయి. వేసవికాలంలో నీటి తొట్లు నిరుపయోగంగా మారడంతో నీరు నిల్వలేక మూగజీవాలు దాహార్తిని తీర్చుకోలేకపోతున్నాయి. ఒకటి, రెండు చోట్ల నీటితొట్లలో నీరు ఉన్నా ఆ నీరు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. నాగారం మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో ఒక్కొక్క గ్రామానికి సుమారుగా 3నుంచి 4 నీటి తొట్లను ఉపాధిహామీ నిధులతో నిర్మించారు. కానీ నీటితొట్లలో నీటి సౌకర్యం కల్పించకుండా గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రస్తుతం అవి అలంకారప్రాయంగా మారాయి. రైతులు తమ పశువులకు, గొర్రెలకు, మేకలకు నీరు తాపడానికి దూర ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి తొట్లకు నీటి సౌకర్యం కల్పించి వేసవిలో మూగ జీవాల దాహార్తి తీర్చాలని రైతులు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తేవాలి



నీటితొట్లు ఉపయోగంలో లేక అలంకారప్రాయంగా మారాయి. నీటితొట్లను నీళ్లతో నింపి మూగజీవాలకు నీరందించాలి. గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా ఉండటంతో చెరువులు, కుంటలను ఆశ్రయించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి నీటితొట్లను వినియోగంలోకి తీసుకరావాలి.

– సంకటి వెంకటేశ్వర్లు, రైతు, పసునూర్

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం


పర్సాయపల్లిలో గురువులతో పూర్వవిద్యార్థులు

అర్వపల్లి : మండల పరిధిలోని పర్సాయపల్లి జెడ్పీహెచ్ఎస్ 2005–2006 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు మంగళవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. 19 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిన్ననాటి స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. రోజంతా కలిసి ఆనందంగా గడిపారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు భద్రయ్య, వీరారెడ్డి, పూలన్, కోటయ్య, రాజగోపాల్, యాదగిరి, అంజయ్య, ప్రభావతి, పూర్వ విద్యార్థులు మధుబాబు, సంతోష్, రమేష్‌కుమార్, కృష్ణ, సైదులు, వనజ, మల్లిక, కార్తీక, లచ్చిరాం, కృష్ణ, సుధాకర్, శ్యాంసుందర్, నరేందర్, వెంకన్న, సంపత్ పాల్గొన్నారు.

నిధులు రాక.. నిర్వహణ భారం

- సర్పంచ్‌లు లేకపోవడంతో గ్రామాలకు నిలిచిన కేంద్రం నిధులు
- పనులు చేయించేందుకు పంచాయతీ కార్యదర్శులపైనే భారం
- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి


తూర్పుగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం

తుంగతుర్తి : గ్రామాలకు గత 15 నెలలుగా సర్పంచ్‌లు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు నానా అవస్థలు పడుతున్నారు. తుంగతుర్తి మండలంలో 24 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వం 24 గ్రామ పంచాయతీలకు 24 మంది ప్రత్యేక అధికారులను నియమించింది. అలాగే 24 గ్రామ పంచాయతీలకు 22 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. రెండు గ్రామాలకు ఇన్‌చార్జ్ కార్యదర్శులు పనిచేస్తున్నారు. అయితే గ్రామాలకు సర్పంచులు లేకపోవడంతో గ్రామపాలన నిర్వహణలో కార్యదర్శులకు, ప్రత్యేక అధికారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పనులు చేయించడంలో ఇబ్బందులు..

గ్రామ పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించకుండా ఆపడం వల్ల గ్రామ పంచాయతీలకు రావాల్సిన కేంద్రం నిధులు కూడా రావడంలేదు. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పనులు చేయించడానికి నిధులు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో పైపులైన్ లీకేజీలు, మోటార్ల మరమ్మతులు, ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్ పౌడర్, వీధిలైట్లు తదితర ఖర్చులకు నిధులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి పనులు చేయిస్తున్నారు. అయితే చేసిన పనులకు కూడా ప్రభుత్వం నుంచి డబ్బులు రావడంలేదు. ఇప్పటివరకు గత 15 నెలలుగా సుమారు లక్ష రూపాయలకు పైబడి అప్పులు చేసి ఉంటామని గ్రామ పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. గ్రామాలకు రావాల్సిన బిల్లులు వెంటనే మంజూరు చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం


సూర్యాపేట అర్బన్ : సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు


నాగారంలో హమాలీ కార్మికులతో మాట్లాడుతున్న దేవరకొండ యాదగిరి

సూర్యాపేట అర్బన్ : బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిఘటిద్దామని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరాజు కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రైతాంగం, కార్మిక వర్గం, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల మల్లయ్య, యల్కా సోమయ్య గౌడ్, సహాయ కార్యదర్శి లకావత్ బాలాజీ నాయక్, ఉపతల వెంకన్న, నాగి లింగయ్య, ఒగ్గు సైదులు, కూర జహంగీర్, చిక్కుల్ల ఉపేందర్, ముస్తఫా, రాజు, నరహరి, నాగరాజు, శ్రీను, పరశురాములు, మంజుల, పార్వతి, పద్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలు ప్రైవేట్‌పరం

పెన్‌పహాడ్ : ప్రభుత్వ సంస్థలను మోదీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తోందని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు భూక్య జగపతి, కార్మికులు పాండు, మంగ్య, కిషన్, కీమా, రమేష్, నాగు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

నాగారం : సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దేవరకొండ యాదగిరి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో కార్మికులను కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తొడుసు లింగయ్య, హమాలీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏ అవకతవకలపై అధికారుల విచారణ


విచారణ చేపడుతున్న అధికారులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామంలో పొదుపు సంఘాల సభ్యుల పొదుపు డబ్బులను స్వాహా చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న వీఓఏపై మంగళవారం అధికారులు గ్రామంలో విచారణ చేపట్టారు. ఏపీఎం అజయ్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ వీఓఏ కుర్రి ప్రమీలపై 2023 అక్టోబర్‌లో జరిగిన విచారణలో పొదుపు సంఘాల డబ్బులు రూ.15లక్షల 17వేల 775లు స్వాహా చేసినట్లు తేలిందని, ఆ డబ్బులను తిరిగి జమచేయకుండా ఉండటంతోపాటు మళ్లీ అవకతవకలకు పాల్పడుతున్నారని, ఆమెపై విచారణ చేపట్టాలని గ్రామానికి చెందిన నక్క సందీప్ ఇటీవల కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో అధికారులు మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలో 34 సంఘాలు ఉండగా 7 సంఘాల పరిధిలోని లావాదేవీల నిర్వహణపై అధికారులు లెక్కలను తేల్చారు. ఈ సందర్భంగా రూ. 5లక్షల 50వేలు సంఘ సభ్యుల పొదుపు డబ్బులను వారి ఖాతాల్లో జమచేయకుండా సొంత ఖర్చులకు ఉపయోగించుకొని, అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు విచారణలో వెల్లడించారు. బ్యాంకు రుణాలను కూడా ఫోర్జరీ సంతకాల ద్వారా తీసుకొని మోసగించినట్లు ఏపీఎం అజయ్‌నాయక్ తెలిపారు. ఈ విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ జ్యోతి, సీసీలు పద్మావతి, శైలజ, మండల అకౌంటెంట్ స్వరూప, సంఘబంధం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం, బొల్లంపల్లి, తిమ్మాపురం గ్రామాలలో మంగళవారం పశు వైద్యశిబిరాలను నిర్వహించారు. పశువులకు ఉచితంగా గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేశారు.

ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్

తిరుమలగిరి: పాలిటెక్నిక్‌లో ప్రవేశం కోసం మంగళవారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వై.సత్తయ్య తెలిపారు. 350 మంది విద్యార్థులకు గాను 321 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.


పరీక్షకు వెళ్తున్న విద్యార్థులు